సంపుటి :02 సంచిక :218 పేజీలు :06

వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

శనివారం 25, సెప్టెంబర్ 2025



## రామప్ప శిల్పకళా నైపుణ్యం అద్భుతం

త్రిపుర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ హేమంత్ వర్మ

03

కాంగ్రెస్ పార్టీలో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల ఎంపిక తుది దశకు వచ్చినట్లు కనిపిస్తున్నది. హస్తిన నుంచి వచ్చిన ఏఐసీసీ పరిశీలకులు ప్రతి జిల్లాలో పర్యటించి, సభలు.. సమావేశాలు నిర్వహించి ప్రతి జిల్లా నుంచి ముగ్గురు పేర్లను అధిష్ఠానానికి సిఫార్సు చేశారు. ఐదేళ్ల పాటు నిరంతరాయంగా పార్టీలో ఉంటూ, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారికి ప్రాధాన్యం ఉంటుందనే ఇప్పటికే పార్టీ నుంచి సంకేతాలు వెలువడ్డాయి. అలాగే ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ సామాజికవర్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించడటంతో పరిశీలకులు ఆ కోణంలోనూ ఎంపిక ఉంటుందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. అధిష్ఠానం నుంచి గ్రీన్‌సిగ్నల్ తీసుకొచ్చేందుకు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఢిల్లీ చేరుకున్నారు. భేటీ అనంతరం ఏఐసీసీ పరిశీలకులు ఒక్కో జిల్లా నుంచి ముగ్గురు చొప్పున సమర్పించిన జాబితాలో చివరకు ఒక్కరిని ఎంపిక చేసి, వారికి డీసీసీ పదవి కట్టబెట్టే అవకాశం ఉంది.

– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి



# డీసీసీ పదవులపై ఉత్కంఠ

ఢిల్లీకి చేరుకున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి కూడా

02

- రెండు రోజుల పాటు పార్టీ పెద్దలతో భేటీ
- తర్వాత పదవులు దక్కించుకున్న వారి జాబితా ప్రకటన
- ఎవరిని పదవులు వరిస్తాయోనని పార్టీ వర్గాల్లో చర్చ
- ఆశావహుల్లో కొనసాగుతున్న సస్పెన్స్

## కన్నుల పండుగలా కార్తీక దీపోత్సవం

- ప్రతి దేవాలయం దీపాలతో అలకరించాలి
- ఎండోమెంటు అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశం
- రాష్ట్రంలోని అన్ని ఆలయాల ఈవోలతో వీడియో కాన్ఫరెన్స్



02

## ఏసీబీ వలలో డిప్యూటీ రిజిస్ట్రార్

- సస్పెండ్ అయిన సిబ్బందికి అనుకూలమైన రిపోర్టుకు లంచం డిమాండ్
- రూ.7 లక్షలు డిమాండ్ చేయగా.. రూ.5 లక్షలకు కుదిరిన బేరం
- రూ.2 లక్షల మొదటి విడత నగదు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



03

## క్రెడిట్ బిల్లుల పేరుతో టోకరా

- పెట్రోల్ బంకులు, మినీ బ్యాంకులు టార్గెట్
- రూ.6 లక్షలు స్వాహా చేసిన వ్యక్తి అరెస్ట్

03



## గంగారం గ్రామానికి అవినీతి మరక

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని గంగారం గ్రామ పంచాయతీకి అవినీతి మరుక అంటుకుంది. ఆదర్శ గ్రామంగా అవార్డులు తీసుకున్న గంగారం గ్రామ పంచాయతీ ఎవరో చేసిన తప్పిదం మూలాన ఆరోపణలు ఎదుర్కొనే దుస్థితి వాటిల్లిందంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పన్నుల పేరుతో ఊరు ఊరునే బురిడీ కొట్టించి ఘరణా మోసానికి పాల్పడ్డారనే అవినీతి వాదనలు గ్రామంలో పెల్లుబికాయి. వెరసి ప్రస్తుతం గంగారం గ్రామ పంచాయతీ ఇష్యు ఓ పంచాయితీగా మారగా ఇప్పుడిదే హాట్ టాపిక్ అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ లు చక్కర్లు కొడుతున్నాయి. గ్రామపంచాయతీ పరిధిలో సుమారు రూ.20 లక్షల మేరా అవినీతి ఆరోపణలు వెలువెత్తుతుండగా విజిలెన్స్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటూ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

– అక్షరదర్బార్, కాటారం

- 2020-21లో పన్నుల పేరుతో లక్షల్లో వసూళ్లు చేసినట్లు ఆరోపణలు
- ప్రభుత్వానికి చెల్లించకుండా ఎగ్గొట్టారనే వాదనలు
- జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదులు
- సర్వత్రా దీనిపైనే ప్రధాన చర్చ
- రేపో మాపో ప్రత్యక్ష ఫిర్యాదులకు బాధితుల సమాయత్తం

04



# కన్నుల పండుగలా కార్తీక దీపోత్సవం

- ప్రతి దేవాలయం దీపాలతో అలకరించాలి
- ఎండోమెంటు అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశం
- రాష్ట్రంలోని అన్ని ఆలయాల ఈవోలతో వీడియో కాన్ఫరెన్స్



అక్షరదర్బార్, హైదరాబాద్: కార్తీక దీపోత్సవాన్ని కన్నుల పండగలా నిర్వహించాలని, రాష్ట్రంలోని ప్రతి దేవాలయం దీపాలతో అలకరించాలని ఎండోమెంటు ఉన్నతాధికారులను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. కార్తీక దీపోత్సవం ఈ నెల 22 నుంచి నవంబర్ వరకు నిర్వహించనున్న నేపథ్యంలో ఎండోమెంటు ఉన్నతాధికారులు, ఈవోలతో శనివారం మంత్రి కొండా సురేఖ రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవాలయాల ఈవోలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ కార్తీక మాసం హిందూ సాంప్రదాయంలో అత్యంత పవిత్రమైనదని గుర్తు చేశారు. ఈ కార్తీక మాసంలో దీపాలను వెలిగించడం చాలా శుభప్రదంగా ఉంటుందని అన్నారు. సామూహిక కార్తీక దీపోత్సవం అంటే అందరూ కలిసి దేవాలయ ప్రాంగణంలో దీపాలను వెలిగించి భక్తి భావంతో పూజలు చేయాలని గుర్తు చేశారు. గతంలో నిర్వహించినట్లుగా ఈ సంవత్సరం కూడా సామూహిక కార్తీక దీపోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించుటకు దేవాదాయ శాఖ చేసే ఏర్పాట్లను మంత్రికి అధికారులు వివరించారు. ప్రతిరోజు సామూహిక కార్తీక దీపోత్సవం సాయంత్రం 6 గంటల నుంచి జరపాల్సి ఉంటుందని, ఈ కార్యక్రమంలో పాల్గొనే మహిళా భక్తులకు మట్టి ప్రమిదలు, వత్తులు, నూనెతో పాటు పసుపు కుంకుమ తాంబూలాలను అందచేస్తున్నట్టు వివరించారు. కార్తీక సోమవారం నాడు సామూహిక కార్తీక దీపోత్సవంలో పాల్గొనే భక్తులకు పైన పేర్కొన్న వస్తువులతో పాటు కుంకుమ, పసుపు, ఆకులు, వక్కలు, ఏదైనా పండు, కనుము ప్రధాన దేవాలయాల్లో భక్తులకు ఇస్తున్నట్టు తెలిపారు. సామూహిక కార్తీక దీపోత్సవంలో భక్తులు దీపాలు ఒదలటానికి అవసరమైనచోట తాత్కాలిక వాటర్ పాండ్స్ కూడా ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. నదీ పరివాహక ప్రాంతాల్లోని దేవాలయాలలో నది హారతి నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది సామూహిక కార్తీక దీపోత్సవంలో భాగంగా భక్తుల కోసం బ్రహ్మశ్రీ నాగఫణిశర్మ, శ్రీ సామవేదం షణ్ముఖ శర్మచే ప్రముఖ దేవాలయాల్లో ప్రవచనాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని నివేదించారు. గత సంవత్సరం బాగా చేశారని మంత్రి ఎండోమెంటు శాఖ ఉన్నతాధికారులు, ఈవోలకు కితాబు ఇచ్చారు. అయితే, చిన్న చిన్న ఇబ్బందులు జరిగాయని, ఈసారి అవి జరగకుండా చూసుకోవాలన్నారు. ఈ దఫా కుంకుమ అర్చన కార్యక్రమం మంచిగా నిర్వహించాలని, మహిళలకు ఇదొక సెంటిమెంటుగా ఉంటుందని మంత్రి వివరించారు. అందుకే పసుపు, కుంకుమ నిర్వహణ ప్రతి టెంపుల్‌లో నిర్వహించాలన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో నదీ హారతి నిర్వహించాలన్నారు. ప్రతి టెంపుల్‌లో లైటింగ్ పక్కాగా ఉండాలన్నారు. టూరిజం డిపార్టుమెంటు సహకారంతో కల్చరల్ కార్యక్రమాలు ఘనంగా చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో ఎండోమెంటు ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరెక్టర్ హరీష్, అడిషనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, సూపరిడెంట్ తదితరులు పాల్గొన్నారు.


www.aksharadarbar.com
అక్షర దర్బార్
Voice of the people

## కోటగుళ్లలో ఘనంగా నాగుల చవితి వేడుకలు

**నాగేంద్ర స్వామికి పంచామృతాలతో అభిషేకం**

**భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన మహిళలు**

అక్షరదర్బార్, గణపురం: మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్లలో శనివారం నాగుల చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజతో ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని నాగేంద్ర స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నాగదేవుని పుట్ట వద్ద పాలు పోసి దీపాలను వెలిగించారు. కార్తీక మాస నాగుల చవితి కావడంతో పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. పూజలు నిర్వహించిన భక్తులకు ఆలయ అర్చకులు నాగరాజు ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలను అందజేశారు.




## మృతుడికి ట్రీట్‌మెంట్ పేరుతో రూ.2 లక్షలు గుంజుకున్నారు!

**హనుమకొండ ప్రైవేట్ ఆసుపత్రి అమానుషం**

దిశ, హనుమకొండ క్రైమ్: హనుమకొండ హంటర్ రోడ్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో దారుణం వెలుగులోకి వచ్చింది. చెన్నారావుపేట మండలం మహేష్ అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడిని దాచిపెట్టి, చికిత్స పేరుతో కుటుంబ సభ్యుల నుంచి ఆసుపత్రి యాజమాన్యం రెండు విడతల్లో రూ.2 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. బకాయిలు చెల్లించకుండా మృతదేహాన్ని అప్పగించడం లేదని బాధితులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. జిల్లా వైద్య శాఖ తక్షణమే స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# డీసీసీ పదవులపై ఉత్కంఠ




## ఢిల్లీకి చేరుకున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

- ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి కూడా
- రెండు రోజుల పాటు పార్టీ పెద్దలతో భేటీ
- తర్వాత పదవులు దక్కించుకున్న వారి జాబితా ప్రకటన
- ఎవరిని పదవులు వరిస్తాయోనని పార్టీ వర్గాల్లో చర్చ
- ఆశావహుల్లో కొనసాగుతున్న సస్పెన్స్

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల ఎంపిక ప్రక్రియకు అధిష్ఠానం నుంచి గ్రీన్‌సిగ్నల్ తీసుకొచ్చేందుకు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఢిల్లీ చేరుకున్నారు. అక్కడ పార్టీ పెద్దలతో చర్చించి, వారి ఆదేశానుసారం డీసీసీ పదవులను ఖరారు చేయనున్నారు. పదవుల కేటాయింపుల్లో సామాజిక వర్గాలకు ప్రాధాన్యమివ్వాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదేశించడంతో ఈ మేరకు ఏఐసీసీ పరిశీలకులు జిల్లాల్లో విస్తృతంగా పర్యటించి, సమావేశాలు నిర్వహించి జాబితా సిద్ధం చేశారు. డీసీసీ పదవులతో పాటు మంత్రివర్గ విస్తరణపైనా ఢిల్లీలో చర్చసాగుతుందని, శని, ఆదివారం రెండు రోజులూ సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు అక్కడే ఉండి పనులు చక్కబెట్టుకుని వస్తారని సమాచారం. ఈ అంశాలన్నింటిపై కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో చర్చ జరుగుతుందని తెలిసింది.

### ఉమ్మడి జిల్లాలో ఆశావహులు

డీసీసీ పదవులకు హనుమకొండ జిల్లా నుంచి దొమ్మటి సాంబయ్య, నమిండ్ల శ్రీనివాస్, రవి యాదవ్, మార్క విజయ్ కుమార్, కట్ల శ్రీనివాస్ రావు, పింగళి వెంకట నరసింహారెడ్డి, వరంగల్ జిల్లా నుంచి బొంపల్లి దేవేందర్ రావు మీసాల ప్రకాష్, పోశాల పద్మ, నవీన్ రాజు, ములుగు జిల్లా జిల్లా నుంచి గొల్లపల్లి రాజేందర్, రాంరెడ్డి, వెంకన్న (ఏటూరునాగారం) పేర్లు వినిపిస్తున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి గాజర్ల అశోక్, అప్పం కిషన్, చల్లూరి మధు, జనగామ జిల్లా నుంచి ఝాన్సీ రెడ్డి, కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి పేర్లు వినపడుతున్నాయి.

### సామాజికవర్గాల వారీగా..

ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలతో పాటు మహిళా కోటా నుంచి జిల్లాల్లో బలం ఉన్నవారి పేర్లను సూచించినట్లు సమాచారం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం గట్టి ప్రయత్నాలు చేస్తున్నందున ఈ పదవుల్లోనూ ఇదే కోటా అమలుకు పార్టీ వర్గాలు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నందున క్షేత్రస్థాయిలో బలంగా పనిచేసే నేతలను ఎంపిక చేయాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. నివేదికలపై లోతైన విశ్లేషణ, చర్చ అనంతరం అధిష్ఠానం నుంచి తుది నిర్ణయం వెలువడనున్నది. డీసీసీ పదవుల నియామకం తర్వాత అధిష్ఠానం ఇక సంస్థాగత పదవుల కేటాయింపుపై దృష్టి సారించనున్నది.

### పదవులకు భారీ డిమాండ్

రానున్న రోజుల్లో డీసీసీ అధ్యక్షులు కీలకం కానుండటంతో ఈ పదవులకు డిమాండ్ ఏర్పడింది. అధికార కాంగ్రెస్తో పార్టీ జిల్లా అధ్యక్షుడి పదవీ కీలకం కావడంతో కుర్చీ దక్కించుకోవడానికి నాయకులు పెద్దఎత్తున ప్రయత్నాలు ప్రారంభించారు. రాబోయే రోజుల్లో డీసీసీలను క్రియాశీలం చేయాలని ఏఐసీసీ నిర్ణయించింది. ఢిల్లీలో శిక్షణ కార్యక్రమాలను సైతం నిర్వహించారు. డీసీసీలు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల పేర్లను సూచించిన వారికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో ఈ పదవులను దక్కించుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఇప్పటికే పరిశీలకుల వద్ద బలప్రదర్శన చేశారు. తమకు అనుకూలంగా వారి వద్ద అభిప్రాయాలు చెప్పే విధంగా లాబీయింగ్‌నడిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర కీలక నేతలకు డీసీసీ అధ్యక్షుల ఎంపిక సవాల్‌గా మారనుంది. తమ అనుకూల వ్యక్తుల పేర్లు సూచించేందుకు సిద్ధమయ్యారు.

### సమర్థులకే పట్టం

సమర్థులకే డీసీసీ అధ్యక్ష పదవులు కట్టబెట్టేందుకు పార్టీ అధిష్ఠానం సిద్ధమవుతున్నది. పదవిని ఆశిస్తున్న వారిలో రెండుసార్లు అధ్యక్ష పదవిలో ఉన్నవారికి నో ఛాన్స్ అని ఇప్పటికే అధిష్ఠానం ప్రకటించింది. అలాగే ఐదేళ్ల పాటు పార్టీ సభ్యత్వం ఉండాలనే నిబంధన కూడా ఉండటంతో కొందరు నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికే పదవుల్లో ఉన్నవారికి పదవి ఇవ్వరాదనే నియమమూ ఉంది. మరోవైపు ఏఐసీసీ పరిశీలకులు ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా పర్యటించారు. తాము సిద్ధం చేసిన నివేదికలను అధిష్ఠానానికి అందజేశారు. క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యకర్తల అభిప్రాయాలు, వివిధ సామాజిక వర్గాల ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం ఇచ్చారు. ఒక్కో జిల్లా నుంచి ముగ్గురు పేర్లతో కూడిన జాబితా ఇచ్చారు. ఏఐసీసీ పరిశీలకులు అందించిన నివేదికల ఆధారంగానే డీసీసీ పదవులు ఖరారు కానున్నాయి.

# డయల్ 100 ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్
- పోలీస్ అధికారులతో నెలవారి నేర సమీక్ష సమావేశం



అక్షరదర్బార్, హనుమకొండ: డయల్ 100 ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అధికారులకు సూచించారు. నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని శనివారం కాకతీయ విశ్వవిద్యాలయం సమావేశ ప్రాంగణంలో నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ కు చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో సీపీ ముందుగా సుధీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్ష జరపడంతో పాటు పెండింగ్‌కు గల కారణాలను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసుల పరిష్కారం కోసం అధికారులు తీసుకోవాల్సిన చర్యలను అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తూనే వారి కదలికలు, స్థితి గతులపై నజర్ పెట్టాలని, గత కొద్ది కాలంగా రౌడీ షీటర్లు స్థానికంగా లేకుంటే, అతను ప్రస్తుతం నివాసం ఉంటున్న ప్రాంతానికి చెందిన పోలీసులకు సమాచారం ఇవ్వాలని, చోరీలకు పాల్పడిన నిందితులతో పాటు, గంజాయి విక్రయాలకు పాల్పడే వారిపై హిస్టరీ షీట్లను తెరవాలని అన్నారు. సైబర్ నేరాల్లో కేవలం బాధితులు నష్టపోయిన సొమ్మును తిరిగి ఇప్పించడమే కాకుండా, నిందితుడిని పట్టుకొనేందుకు స్టేషన్ అధికారులు కృషి చేయాలని, పోక్సో కేసుకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలన్ని గడువు లోపు పూర్తి చేయాలని, రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ అధికారిగా ఎస్ఐ స్థాయి అధికారి తప్పక విధులు నిర్వర్తించాలని, ట్రాఫిక్ పోలీసుల తరహాలోనే స్టేషన్ అధికారులు తమ పరిధిలో పెండింగ్ లో ఉన్న ట్రాఫిక్ జరిమానాదారులకు ఫోన్ చేసి జరిమానా చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చోరీ కేసుల్లో రికవరీ శాతాన్ని పెంచాలని, చోరీలకు పాల్పడిన నిందితులను పట్టుకోవడం కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయడంతో పాటు నిందితులు దేశంలో ఎక్కడ ఉన్నా అరెస్టు చేసేందుకు పోలీస్ అధికారులు ప్రణాళికను రూపొందించుకోవాలని చెప్పారు. నేరాల నియంత్రణకు పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని, సీసీ కెమెరాల వినియోగం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ముఖ్యంగా నిందితులకు కచ్చితంగా శిక్ష పడే రీతిలో పోలీస్ అధికారులు దర్యాప్తు చేపట్టాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో గతంలో నేర చరిత్ర ఉన్న వ్యక్తుల ప్రస్తుత స్థితిగతులపై వివరాలు అందుబాటులో ఉండాలని, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్ కేసులను ట్రాఫిక్ పోలీసులతో పాటు, లా అండ్ ఆర్డర్ పోలీసులు నమోదు చేయాల్సి ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో ఈస్ట్ జోన్, వెస్ట్ జోన్ డీసీపీలు రాజమహేంద్ర నాయక్, అంకిత్‌కుమార్, వరంగల్, జనగామ ఏఎస్పీ చేతన్‌నితిన్, అదనపు డీసీపీలు రవి, ప్రభాకర్‌రావు, బాలస్వామితో పాటు ఏసీపీలు, ఇన్ స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## మద్యం దరఖాస్తు ఫీజుతో ₹55 కోట్లు ఆదాయం!

### భూపాలపల్లిలో 59 షాపులకు 1,863 దరఖాస్తులు



అక్షర దర్బార్, భూపాలపల్లి: భూపాలపల్లి ఎక్సైజ్ యూనిట్‌లో 2025-27 సంవత్సరాలకు గాను 59 మద్యం దుకాణాల దరఖాస్తుల ద్వారా ₹55.89 కోట్ల భారీ ఆదాయం సమకూరింది. మొత్తం 1,863 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. అత్యధికంగా మల్లంపల్లి షాపునకు 77 దరఖాస్తులు అందాయి. దుకాణాల కేటాయింపునకు సంబంధించిన లాటరీ ప్రక్రియ అక్టోబర్ 27, 2025 సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ రాహుల్ శర్మ సమక్షంలో ఇల్లందు క్లబ్ హౌస్‌లో జరుగుతుందని, దరఖాస్తుదారులు ఒరిజినల్ రిసిప్ట్‌తో హాజరు కావాలని ఆయన సూచించారు.

# పైవేటుకు వద్దు.. అంగన్‌వాడీకే పంపండి!

### ఆటపాటలతో క్రమశిక్షణతో కూడిన విద్య ఈసీసీ డే ప్రోగ్రాంలో ఎంపీడీవో జయశ్రీ



అక్షర దర్బార్, చిట్యాల: పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని స్థానిక ఎంపీడీవో జయశ్రీ తల్లిదండ్రులకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యను అందించడంతో పాటు, క్రమశిక్షణ నేర్పడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. శనివారం చిట్యాల మండల కేంద్రంలోని 2, 3వ అంగన్వాడీ కేంద్రాలలో టీచర్లు భాగ్యమ్మ, అరుణలు ఏర్పాటు చేసిన పూర్వ ప్రాథమిక విద్య (ఈసీసీ డే ) ప్రోగ్రాంకు ఎంపీడీవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీలో మెరుగైన విద్య: 3 నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపిస్తే, ఆట, పాట, కథల ద్వారా మంచి క్రమశిక్షణతో కూడిన విద్యను, మంచి అలవాట్లను టీచర్లు నేర్పిస్తారన్నారు. ప్రైవేట్ స్కూళ్లకు పంపడం వల్ల ఆర్థిక నష్టంతో పాటు, ఉదయాన్నే బాక్సుల్లో పెట్టిన అన్నం తినలేక పిల్లలు అనారోగ్యానికి గురవడం, ఎదుగుదల ఆగిపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ జయప్రద మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాలలో కాన్వెంట్ స్కూళ్లలో లేని మెటీరియల్‌ను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. ఆట వస్తువులను చూస్తూనే పిల్లలు తెలుగు, ఇంగ్లీషు బోధన, ఎల్‌కేజీ, యూకేజీ, నర్సరీకి సంబంధించిన విద్యను సులభంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా 3 సంవత్సరాలలోపు పిల్లలకు ఎంపీడీవో చేతుల మీదుగా కోడిగుడ్లను పంపిణీ చేశారు.



# ఏసీబీ వలలో డిప్యూటీ రిజిస్ట్రార్

- సస్పెండ్ అయిన సిబ్బందికి అనుకూలమైన రిపోర్టుకు లంచం డిమాండ్
- రూ.7 లక్షలు డిమాండ్ చేయగా.. రూ.5 లక్షలకు కుదిరిన బేరం
- రూ.2 లక్షల మొదటి విడత నగదు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



అక్షరదర్బార్, మంచిర్యాల: డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాలలోని డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ కార్యాలయంలో డిప్యూటీ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న రాథోడ్ బిక్కు వద్దకు ఆశాఖలో ఇటీవల సస్పెండ్ అయిన వ్యక్తి వచ్చాడు. తనను తిరిగి విధుల్లోకి తీసుకునేందుకు కమిటీకి అనుకూల నివేదిక ఇవ్వడం, పెండింగ్‌లో ఉన్న జీతాల బిల్లింగ్, పెరిగిన జీతాల అమలు, సస్పెన్షన్ కాలానికి సంబంధించిన అలవెన్సులు చెల్లించడం, విచారణ నివేదికపై తదుపరి చర్యలు తీసుకోకుండా ఉండటం వంటి నాలుగు పనులు చేసి పెట్టాలని కోరాడు. రాథోడ్ బిక్కు అందుకు రూ.7 లక్షలు డిమాండ్ చేశాడు. చివరకు బేరం రూ.5 లక్షల వద్ద ఆగింది. ఫిర్యాదు దారుడు మొదటి విడతలో రూ.2 లక్షలు ఇస్తానని ఒప్పుకున్నాడు. ఫిర్యాదు దారుడి నుంచి శనివారం రాథోడ్ బిక్కు రూ.2 లక్షలు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.2 లక్షల స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కరీంనగర్‌లోని స్పెషల్ జడ్జ్ ఫర్ ఎస్పీఈ అండ్ ఏసీబీ కోర్టు ముందు హాజరుపరిచారు. అధికారులు ఎవరైనా లంచం అడిగితే 1064కు లేదా వాట్సాప్ 94404 46106కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు.

## క్రెడిట్ బిల్లుల పేరుతో టోకరా

### పెట్రోల్ బంకులు, మినీ బ్యాంకులు టార్గెట్

### రూ.6 లక్షలు స్వాహా చేసిన వ్యక్తి అరెస్ట్




అక్షరదర్బార్, పర్వతగిరి: జనగామ, హనుమకొండ, వరంగల్ జిల్లాల్లోని పెట్రోల్ బంకులు, మినీ బ్యాంకులను టార్గెట్ చేసి, క్రెడిట్ కార్డు బిల్లులు కట్టే పేరుతో భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసిన మోసగాడిని పోలీసులు పట్టుకున్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లాకు చెందిన రాపోలు శ్రీనివాస్ అనే ఈ వ్యక్తి పర్వతగిరి, నెక్కొండ, వర్ధన్నపేట, లింగాల ఘనపూర్, రఘునాథపల్లి మండలాల్లోని పెట్రోల్ బంకులు, మినీ ఏటీఎంలను టార్గెట్ చేశాడు. సుమారు రూ. 6 లక్షల వరకు స్వాహా చేశాడు. పోలీసులు నిందితుడిని అదుపులోకి విచారించగా నేరం అంగీకరించాడు. నిందితుడి నుంచి పోలీసులు రూ.3 లక్షల నగదు, ఆరు గ్రాముల బంగారం, స్కూటీ, మొబైల్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

# రామప్ప శిల్పకళా నైపుణ్యం అద్భుతం

- త్రిపుర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ హేమంత్ వర్మ



అక్షరదర్బార్, వెంకటాపూర్: రామప్పలోని ప్రతి ఒక్క శిల్పం ఆనాడు నిర్మించిన కాకతీయుల కళ నైపుణ్యానికి అద్దం పడుతుందని త్రిపుర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ హేమంత్ వర్మ పేర్కొన్నారు. త్రిపుర ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ హేమంత్ వర్మ దంపతులు హన్మకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్ కు వచ్చారు. వారికి ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ హెచ్ఆర్డీ సి ప్రభాకర్ పుష్ప గుచ్ఛంతో ఆహ్వానం పలికారు. అనంతరం ములుగు జిల్లా వెంకటాపురం మండలం పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయాన్ని హేమంత్ వర్మ దంపతులు సందర్శించారు. ముందుగా శ్రీ రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పూజారులు వారిచే శ్రీ రామలింగేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గైడ్ రామప్ప చరిత్రను వివరించారు. చైర్మన్ హేమంత్ వర్మ మాట్లాడుతూ రామప్ప శిల్పాలలో కళాత్మక వైభవం ఉట్టిపడుతున్నట్లు నిర్మించారని అన్నారు . యునెస్కో గౌరవం దక్కిన రామప్ప రాతిపై చెక్కిన ఇక్కడి శిల్పాల్లో జీవకళ ఉట్టిపడుతోందని పేర్కొన్నారు. చరిత్ర భవిష్యత్ తరాలకు ఎన్నో అంశాలను తెలియజేస్తుందని చెప్పారు. జీవకళ ఉన్న శిల్పకళాకృతులకు మరో రూపమే రామప్ప అని కితాబు నిచ్చారు. ఎంతో ఘన చరిత్ర గల రామప్పను సందర్శించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తర్వాత లక్నవరం సస్పెన్షన్ వంతెనపై విహరిస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ములుగు డీఈ పులుసం నాగేశ్వర్ రావు, ఏడీఈ వేణుగోపాల్, విజిలెన్స్ ఎస్ఐ పురుషోత్తం, ఏఈ రమేష్, కిషోర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు .

# కాంగ్రెస్‌కు కార్యకర్తలే కొండంత అండ

- నియోజకవర్గ కన్వీనర్ తక్కెళ్లపల్లి రవీందర్ రావు
- అశోక్ నగర్‌లో కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం



అక్షర దర్బార్, ఖానాపూర్: కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే అసలైన బలం అని, వారి శ్రమ వల్లే నియోజకవర్గంలో మెజారిటీ సాధించగలిగామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపెల్లి రవీందర్ రావు స్పష్టం చేశారు. శనివారం ఖానాపురం మండలంలోని అశోక్ నగర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రవీందర్ రావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నాయకత్వంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తల ఆకాంక్ష మేరకు అభ్యర్థులను బరిలోకి దించి, కాంగ్రెస్ సత్తా మళ్లీ చాటాలని పిలుపునిచ్చారు. అశోక్ నగర్ గ్రామ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఎంతో రుణపడి ఉందని, రాబోయే రోజుల్లో అందరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యకర్తలు ఐక్యంగా ఉండాలని, కష్టకాలంలో తాము, పార్టీ నాయకులమంతా అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే కార్యకర్తల పార్టీ అని, వారే పార్టీకి కొండంత అండగా నిలుస్తారని నొక్కి చెప్పారు. ఈ సమావేశంలో అశోక్ నగర్ గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎల్డి శ్రీనివాస్, పార్టీ ఉపాధ్యక్షుడు బండి సంజీవ, బీసీ సెల్ అధ్యక్షుడు కదురు సారయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు జాడి వెంకటేష్, యూత్ అధ్యక్షుడు కుస మునిందర్, మైనారిటీ నాయకుడు ఎండి సమ్మద్ సహా పలువురు నాయకులు, వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాల్లో బీజేపీ జెండా ఎగరాలి

### కేంద్ర పథకాలే అభివృద్ధికి నిదర్శనం

### వరంగల్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి రాణా ప్రతాప్ రెడ్డి

అక్షర దర్బార్, నల్లబెల్లి: బూత్ స్థాయిలో బీజేపీని బలోపేతం చేసి, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగురవేయాలని వరంగల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోవుల రామ ప్రతాపరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నల్లబెల్లి మండలంలోని ముచ్చింపుల ఎంపీటీసీ పరిధిలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గ్రామాలకు అందుతున్న అన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు (పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, ఎరువుల సబ్సిడీ, లోన్లు) కేంద్ర ప్రభుత్వ నిధులేనని ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రధాని మోడీ పాలనలో దేశ ఆర్థికంగా, రక్షణపరంగా బలపడిందని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులనే గెలిపించి మోడీ నాయకత్వంలో గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.



## పరకాలలో కల్తీ కోరలు!

### ఫుడ్ సేఫ్టీ శాఖ తనిఖీలు శూన్యం




అక్షర దర్బార్, పరకాల: పరకాల ప్రాంతంలో వ్యాపారులు నాణ్యతలేని కల్తీ ఆహార పదార్థాలను విచ్చలవిడిగా మార్కెట్లోకి వదులుతున్నారు. బొంగులు, మురుకులు, రింగులు, కారం వంటి చిరుతిళ్లను అనుమతి లేకుండా ప్యాకింగ్ చేసి అమ్ముతున్నారు. కొందరు వ్యాపారులు నాణ్యత లేని కల్తీ నూనెను ఉపయోగించి రూ.5, రూ.10 వంటి చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి పేద, మధ్యతరగతి ప్రజలకు అమ్ముతున్నారు. రిటైల్ షాపుల నిర్వాహకులు అధిక లాభాల కోసం వీటిని వినియోగదారులకు అంటగడుతున్నారు. బ్రాండింగ్ లేదు.. వివరాలు లేవు: ఈ పదార్థాలను అపరిశుభ్రమైన స్థలాల్లో తయారు చేసి, ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేసి సరఫరా చేస్తున్నారు. వీటిపై బ్రాండ్ పేరు, తయారీ తేదీ, గడువు తేదీ, ఫుడ్ లైసెన్స్ వంటి కనీస వివరాలు ఏవీ ఉండటం లేదు. నల్ల ఉప్పు, కల్తీ కారం, నూనె వాడకం వల్ల పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణ చర్యలు కోరిన ప్రజలు: ప్రజా ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఆహార కల్తీ నియంత్రణ శాఖ అధికారులు తక్షణమే రంగంలోకి దిగి, ఇలాంటి పరిశ్రమలపై కఠిన చర్యలు చేపట్టాలని, నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## స్కాలర్‌షిప్‌లు, ఎఫ్ఆర్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

అక్షర దర్బార్, పరకాల: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ (ఎఫ్ఆర్), స్కాలర్‌షిప్‌ల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ పరకాల కమిటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్, శారద హైస్కూళ్లలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఎస్ఎఫ్‌హెచ్ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

# గంగారం గ్రామానికి అవినీతి మరక

- 2020-21లో పన్నుల పేరుతో లక్షల్లో వసూళ్లు చేసినట్లు ఆరోపణలు
- ప్రభుత్వానికి చెల్లించకుండా ఎగ్గొట్టారనే వాదనలు
- జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదులు
- సర్వత్రా దీనిపైనే ప్రధాన చర్చ
- రేపో మాపో ప్రత్యక్ష ఫిర్యాదులకు బాధితుల సమాయత్తం

అక్షరదర్బార్, కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని గంగారం గ్రామ పంచాయతీకి అవినీతి మరుక అంటుకుంది. ఆదర్శ గ్రామంగా అవార్డులు తీసుకున్న గంగారం గ్రామ పంచాయతీ ఎవరో చేసిన తప్పిదం మూలాన ఆరోపణలు ఎదుర్కొనే దుస్థితి వాటిల్లిందంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పన్నుల పేరుతో ఊరు ఊరునే బురిడీ కొట్టించి ఘరణా మోసానికి పాల్పడ్డారనే అవినీతి వాదనలు గ్రామంలో పెల్లుభీకాయి. వెరసి ప్రస్తుతం గంగారం గ్రామ పంచాయతీ ఇష్యు ఓ పంచాయితీగా మారగా ఇప్పుడిదే హాట్ టాపిక్ అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ లు చక్కర్లు కొడుతున్నాయి. గ్రామపంచాయతీ పరిధిలో సుమారు రూ.20 లక్షల మేరా అవినీతి ఆరోపణలు వెలువెత్తుతుండగా విజిలెన్స్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటూ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

### పన్నుల పేరుతో లక్షల్లో వసూళ్లు..?

గంగారం గ్రామ పంచాయతీ పరిధిలో 2020-21 సంవత్సరంలో అప్పటి సంబంధిత అధికారులు ఇంటి పన్ను పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు కాటారం మండల బీఆర్ఎస్ నాయకుడు సల్ల శేఖర్ రెడ్డి జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. గంగారం గ్రామంలో జంగు సిపాయి భూములుండగా అవి ప్రభుత్వ భూములుగానే పరిగణించబడ్డాయి. ఈ నేపథ్యంలో అక్కడి ప్రజల అమాయకత్వాన్ని ఆశరుచేసుకున్న అప్పటి పంచాయతీ పాలకవర్గం, పంచాయతీ కార్యదర్శి మీ ఓపెన్ ప్లాట్లకు పట్టా కల్పిస్తామని అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు శేఖర్ రెడ్డి ఆరోపించారు. ఏకంగా రషీదుల బుక్కునే సృష్టించుకుని ఒక్కో కుటుంబం వద్ద రూ.1000 నుంచి మొదలుకుని రూ.9 వేల వరకు వసూళ్లు చేశారని విమర్శించారు. దీనికి సాక్షాత్కారాలుగా ఇప్పటికీ రషీదు పేపర్లు ఉన్నాయని, ప్రజలే స్వచ్ఛందంగా వచ్చి ఫిర్యాదులు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు శేఖర్ రెడ్డి వెల్లడించారు. ఇప్పటికే దీనిపై ఆర్టీఐ చట్టం ద్వారా సమాచారం కోరడం జరిగిందని, దీనికి బదులుగా ఎలాంటి పొంతన లేని సమాధానాలు రావడం గమనార్హమని శేఖర్ రెడ్డి పేర్కొన్నారు.

### ప్రభుత్వానికి చెల్లించలేదంటూ ఆరోపణలు

ఇంటి పన్నుల పేరుతో రశీదు బుక్కులనే సృష్టించి వసూళ్లకు పాల్పడిన సదరు వ్యక్తులు కాస్తా ప్రభుత్వానికి ఆ నిధులు జమ చేయలేదన్నట్లుగా సమాచారం. ఆర్టీఐ చట్టం ద్వారా సమాచారం కోరిన శేఖర్ రెడ్డికి దిమ్మతిరిగే ఇన్ఫర్మేషన్ వచ్చినట్లు పేర్కొన్నారు. గంగారం గ్రామపంచాయతీ మొత్తం మీద 600 ఇళ్ళు ఉండగా అందులో రూ. 9000తో పాటు రూ.1000 కూడా వసూలు చేసినట్లు రసీదుల రూపంలో ఆనవాళ్లు ఉన్నాయి. వారిచ్చిన రసీదుల ప్రకారం సుమారు మొత్తంగా 20 లక్షల మేర అవుతున్నాయి. అయితే ఆ డబ్బులు ప్రభుత్వ ఖజానాకు కట్టాల్సింది ఉండగా కేవలం రూ.3 లక్షల 26 వేల 97లు మాత్రమే చెల్లించి ప్రభుత్వాన్నే బురిడీ కొట్టించినట్లుగా శేఖర్ రెడ్డి ఆరోపించడం గమనార్హం. ఇంటి పన్నులు ఎంతలా వసూళ్లు చేసిన వేలల్లో మాత్రమే ఉంటుందని లక్షల్లో వసూళ్లు చేసి ప్రజలని మోసం చేసిన అప్పటి గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామపంచాయతీ కార్యదర్శిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని శేఖర్ రెడ్డి కోరారు.



# ఓటర్ల జాబితా 'ఎస్ఐఆర్' పకడ్బందీగా పూర్తి చేయాలి

- అధికారులతో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి
- వీడియో కాన్ఫరెన్స్ క్షేత్ర స్థాయిలో వివరాల పరిశీలనకు ఆదేశం



అక్షర దర్బార్, భూపాలపల్లి: ఓటర్ల జాబితాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, అదనపు ఎన్నికల అధికారి లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులతో ఎస్ఐఆర్ నిర్వహణపై వారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

### 2002 డేటాతో మ్యాపింగ్ చేయాలి..

ఎస్ఐఆర్ నిర్వహణ కోసం చేపట్టిన సన్నాహక కార్యాచరణలో పురోగతి ఉండాలని సీఈఓ సుదర్శన్ రెడ్డి అన్నారు. 2002లో చేసిన ఎస్ఐఆర్ వివరాలను 2025 స్పెషల్ సమ్మరీ రివిజన్ ఓటర్ జాబితాతో మ్యాపింగ్ ప్రక్రియను రిటర్నింగ్ అధికారులు పర్యవేక్షించి, వేగవంతం చేయాలన్నారు. పోలింగ్ కేంద్రం స్థాయిలో 2002 ఎస్ఐఆర్ డేటా, 2025 ఎస్ఐఆర్ డేటాను పరిశీలన చేయాలన్నారు. ఈ రెండు జాబితాలలో కామన్ పేర్లు మినహాయించి, 2002 తర్వాత ఓటరుగా నమోదైన వారి వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ధృవీకరించాలని స్పష్టం చేశారు. త్వరలో మ్యాపింగ్ పూర్తి: ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ మ్యాపింగ్‌లో భాగంగా కేటగిరి 'ఏ'ను బిఎల్.ఓ. యాప్ ద్వారా ధృవీకరిస్తామని తెలిపారు. కేటగిరి 'సి', 'డి' లింక్ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. ఈ.ఆర్.ఓ. కార్యాలయంలో ప్రత్యేకంగా బూత్ స్థాయి అధికారులను కేటాయించి, త్వరితగతిన మ్యాపింగ్‌ను పూర్తి చేస్తామని వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, రెవెన్యూ డివిజన్ అధికారి రవి, తహసిల్దార్ శ్రీనివాసు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పండి!

## కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను భారీ మెజారిటీతో గెలిపించండి

## ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



అక్షర దర్బార్, జూబ్లీహిల్స్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు సరైన గుణపాఠం చెప్పి, కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. శనివారం జూబ్లీహిల్స్ అసెంబ్లీ పరిధిలోని 94వ డివిజన్ (సీతానగర్, వినోభానగర్, ఐక్యమత్యనగర్, ద్వారకానగర్, మారుతినగర్) ప్రాంతాలలో రాష్ట్ర కార్మిక మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంచి పనులు చేసి ఓట్లు అడుగుతున్నాం: ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ, నవీన్ యాదవ్ ఆదర్శభావాలు కలిగిన వ్యక్తి అని, అతన్ని ఎన్నుకుంటే జూబ్లీహిల్స్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. తాము ప్రజలకు చేసిన మంచి పనులు వివరిస్తూ ఓట్లు అడుగుతున్నామని, కానీ బీఆర్ఎస్ మాత్రం అసత్య ప్రచారాలు, సానుభూతితో ఓట్లు కొల్లగొట్టేందుకు చూస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమంలో దూసుకుపోతోందని, రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలను రెండేళ్లలో అమలు చేశామని తెలిపారు.

# మహా రుద్రయాగానికి ధాన్యం సేకరణ ప్రారంభం



అక్షర దర్బార్, పరకాల: పట్టణంలోని శ్రీ కుంకుమేశ్వర ఆలయంలో నవంబర్ 3న జరగనున్న మహా రుద్రయాగం సందర్భంగా, మహా రుద్ర యాగ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ధాన్యం సేకరణ కార్యక్రమం ప్రారంభమైంది. పరకాల పట్టణంలోని ప్రతి వీధి, ప్రతి ఇంటి సమీపానికి ప్రత్యేక నగరోత్సవ వాహనం వెళ్లి ధాన్యాన్ని స్వీకరించనుంది. నగర ప్రజలందరూ తమ ఇంటికి వచ్చే వాహనానికి ధాన్యాన్ని సమర్పించి స్వామివారి ఆశీస్సులు పొందాలని యాగ కమిటీ కోరింది. ఈ కార్యక్రమంలో కుంకుమేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు, మహా రుద్ర యాగ కమిటీ అధ్యక్షుడు ఎర్రం లక్ష్మన్న, మాజీ చైర్మన్లు గందె వేంకటేశ్వర్లు, చందుపట్ల నరసింహారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి సారంగపాణి సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# పసిపిల్లల ప్రాణాలతో చెలగాటం

- ఎంజీఎం పిల్లల వార్డులో దయనీయ స్థితి
- ఇద్దరు పసికందులకూ ఒకటే ఆక్సిజన్ సిలిండర్
- వైద్యపరీక్షలకు పిల్లలను తరలిస్తుండగా తీసిన వీడియో వైరల్
- వైద్యసిబ్బందిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల డిమాండ్

అక్షరదర్బార్, వరంగల్: దక్షిణ తెలంగాణకు ఆరోగ్యదాయినిగా పేరున్న ఎంజీఎం ఆసుపత్రి ప్రభ రోజురోజుకూ మసకబారుతున్నది. ఆస్పత్రిలోని పిల్లల వార్డులో శనివారం దయనీయమైన ఘటన చోటుచేసుకున్నది. వైద్యాధికారుల పర్యవేక్షణ లోపమో,ఆలసత్వమో తెలియదు గానీ, వైద్యసిబ్బంది ఇద్దరు పసికందులకూ ఒకటే ఆక్సిజన్ సిలిండర్ అమర్చారు. వైద్యపరీక్షల నిమిత్తం పిల్లలను తరలించాల్సి రావడంతో ఇద్దరు పసికందులను వేర్వేరుగా ఇద్దరు వ్యక్తులు ఎత్తుకున్నారు. ఆక్సిజన్ సిలిండర్‌ను మరో వ్యక్తి మోసుకెళ్తున్నాడు. ఈ దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఆస్పత్రిలోని పిల్లలవార్డుకు రాష్ట్రనలుమూలల నుంచి తల్లిదండ్రులు వేర్వేరు సమస్యలతో బాధపడుతున్న పిల్లలను తీసుకొస్తారు. ఇక్కడ చిన్నారులకు పారా మెడికల్, రేడియాలజీ సేవలు అందుతాయి. కానీ, వైద్యాధికారులు ఈ వార్డును పట్టించుకోకపోవడం, వైద్యసిబ్బంది ఇష్టారీతిన వైద్యం చేస్తుండటం పిల్లల తల్లిదండ్రుల్లో ఆందోళన కలిగిస్తుంది. తాజాగా శనివారం ఇద్దరు పసి పిల్లలకు ఒకటే ఆక్సిజన్ సిలిండర్ అమర్చి, పరీక్షలకు తరలిస్తుండటం మరింత ఆందోళన రేపింది. కనీసం పిల్లలను తీసుకెళ్లేందుకు కేర్ టేకర్లు కూడా లేకపోవడం గమనార్హం. నిబంధనల ప్రకారం దాయమ్మ లేదా పేషెంట్ కేర్ సిబ్బంది చిన్నారులు తరలించాల్సి ఉంది. వార్డు బాధ్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే ఇలాంటి పరిస్థితి దాపురించిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన వైద్యసిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



# పోలీసు వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన

## చిట్యాల పోలీస్ స్టేషన్‌లో 'ఓపెన్ హౌస్'

అక్షర దర్బార్, చిట్యాల: అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా, చిట్యాల సీఐ డి. మల్లేష్ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం జరిగింది. వెలుగు స్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్సై శ్రవణ్ కుమార్ పోలీసుల విధులు, వినియోగించే ఆయుధాలు, కమ్యూనికేషన్ పరికరాలను ప్రదర్శించి, ట్రాఫిక్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను అధికారులు నివృత్తి చేశారు.




# కేయూ స్కాలర్‌కు పీహెచ్‌డీ అవార్డు



అక్షరదర్బార్, హనుమకొండ : సోషల్ వర్క్ విభాగానికి చెందిన రీసెర్చ్ స్కాలర్ బత్తిని వాణి సోషల్ వర్క్‌లో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ (పీహెచ్‌డీ) డిగ్రీకి అర్హత సాధించినట్లు కాకతీయ విశ్వవిద్యాలయ పరీక్షల కంట్రోలర్ కార్యాలయం ప్రకటించింది. కోయ తెగ మహిళల్లో ఆరోగ్యాన్ని కోరుకునే ప్రవర్తన - ఒక అధ్యయనం అనే ఆమె డాక్టరల్ థీసిస్ ఏటూరునాగారం ప్రాంతంలోని కోయ గిరిజన మహిళల ఆరోగ్య సంరక్షణ విధానాలు, ప్రవర్తనా అంశాలను అన్వేషిస్తుంది. కాకతీయ విశ్వవిద్యాలయంలోని సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ వీసీ ప్రొఫెసర్ టిరమేష్ (రిటైర్డ్) పర్యవేక్షణలో ఈ పరిశోధన జరిగింది. వాణి పీహెచ్‌డీ అర్హతలను విజయవంతంగా పూర్తి చేసినట్లు పరీక్షల కంట్రోలర్ అధికారికంగా ప్రకటించారు . నోటిఫికేషన్ కాపీలను రిజిస్ట్రార్, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, యూనివర్సిటీ న్యూస్, ఇతర సంబంధిత అధికారులకు రికార్డు, ప్రచురణ కోసం పంపారు.

# అంబేద్కర్ నేషనల్ అవార్డుకు చిట్యాల కిరణ్

## 15 ఏళ్ల సామాజిక సేవకు గుర్తింపు



అక్షర దర్బార్, చిట్యాల: చిట్యాల అంబేద్కర్ యువజన సంఘం సీనియర్ నాయకులు గురుకుంట్ల కిరణ్‌కు అంబేద్కర్ నేషనల్ అవార్డు లభించింది. స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఎన్జీవో చైర్మన్ డాక్టర్ ఆకుల రమేష్ ఈ విషయాన్ని తెలిపారు. గత 15 ఏళ్లుగా కిరణ్ బడుగు, బలహీన వర్గాల కోసం, దళితులు, మహిళల కోసం చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ పురస్కారాన్ని నవంబర్ 5న హైదరాబాద్‌లో అందజేయనున్నారు.

# మృతుల కుటుంబాలకు జిల్లా ఓబీసీ సెక్రటరీ పరామర్శ



అక్షర దర్బార్ , శాయంపేట: శాయంపేటలో ఇటీవల మరణించిన అల్లం సరోజన ప్రథమ వర్ధంతి, వలుపదాసు మరుద్వతి కుటుంబ సభ్యులను శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ఆదేశాల మేరకు జిల్లా ఓబీసీ సెక్రటరీ పోతాల గడ్డం భాస్కర్ పరామర్శించారు. భాస్కర్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

**డిజిటల్ విప్లవంలో భాగంకండి!**

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

**మీ నమ్మకమే మా బలం!**

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915